# పుష్పద్వయం

శ్రీ కె. జి. ఆచార్య

'అన్నయ్యా! ... రమేశన్నయ్యా! ... అబ్బ! ... తొందరగ లేచిరావాలి! ... యెంత అందంగా వున్నాయో చూడు! ...'

అని దొడ్డిలోంచి మాయిందిర ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ గట్టిగాపిలుస్తూన్నప్పటికీగూడా రమేశ్ లేవనేలేదు. నేనూ ఆసమయంలోనే ముఖంకడుక్కొంటూన్నాను. దానిమాటలు వినబడ్డాయిగాని, యేమిటోనని వూరుకున్నా. కాని ఆలస్యాన్ని సహించలేనిదానిలాగ, మళ్లీగట్టిగా, 'ఓ మొద్దునిద్ర రన్నయ్యోయ్, లేచి రా!' అనిఅంది. అంతవరకూ అక్కడేవున్న మా సుభాష్ కూడా వచ్చీరానిమాటల్తో, 'అన్నయ్యోయ్, యిప్పులు మనదొడ్డిలో యెంతబాగుందోతూలు!' అని యెక్కడ లేనిసంతోషంతో గంతులేస్తూ, వాడి మంచందగ్గరకు వచ్చి లేపేడు. కాని రమేశ్ కోపంతో గట్టిగగదిమి, మళ్లీ పడుకోవడంచేత, తనుపిలిస్తే రాలేదనేకోపంతో కాబోలు, 'యెదవ మొద్దునిద్దల!' అనిఅనేసి, వెంటనే నాదగ్గరకువచ్చి 'నాన్నగాలూ! ఒక్కచాలి దొడ్డిలోకి లండి! యెంతబావున్నాయోతూలండి!' అంటూ, నే లేచే వరకూ వదలిపెట్టలేదు.

'అబ్బ! అదేమిట్రా?' అని నేను విసుగుతోఅన్నాను. కాని 'లేచి యిలా లండి తెలుత్తుంది!' అని అసలువిషయం చెప్పడంమానివేసి చేయిబట్టుకొనిలాగుతూండడం వల్ల, యిక లేచివెళ్లడంతప్పిందికాదు. దొడ్డిలోకి వెళ్లీ వెళ్లడంలోనే పెద్దకుండీలోనిగులాబి మొక్కమీద అర్ధ వికసితాలైవున్న రెండు ప్రసూనాలు పరిమళిస్తూ, నా కళ్లకు కనబడ్డాయి! నా కపరిమితమయిన ఆనందంగలిగింది! గుబురుగాను, యెత్తుగాను పెరిగిన మొక్కలున్న, ఆచిన్నకుండీలమధ్య, ఆపెద్దకుండీలో పచ్చపచ్చని ఆకులతోనూ, చిన్నచిన్నముండ్లుతోనూనిండివున్న ఆ గులాబి చెట్టుచిన్నికొమ్మమీద, అర్ధనయనాలతో అవలోకిస్తూ చక్కని చిన్న చిరునవ్వు నవ్వుతూన్న ఆప్రసూన ద్వయం, చిన్నరమ్యోపవనం లా, వున్న మాదొడ్డికి ఆ సుప్రభాతసమయంలో, అనిర్వాచ్యమైన ఒకనూత్న ప్రకాశాన్ని తెచ్చింది! అక్కడ క్రొత్తగా మొక్కలు వేసినతర్వాత, కుసుమాలు వికసించడానికి, అదేప్రథమం కావడంచేత, అవియెప్పుడు పుష్పిస్తాయా, అని ప్రతీ రోజూ వువ్విళ్లూరుతూ వాటికోసం ప్రతీక్షిస్తూన్న మా యిందిరా సుభాషులముఖకమలాలుగూడా ఆరోజే, ఆ రోజాపుష్పాలతోబాటే వికసించాయి! వాళ్లఆనందానికి హద్దే లేకపోయింది ఆనాడు!

*

మర్నాడింకా తెల్లవారిందోలేదోగాని, అప్పుడే మా యిందిరా సుభాషులిద్దరూ పడుకొనివున్న నాదగ్గరకు వచ్చి, 'నాన్నగారూ! పువ్వులు పూర్తిగావిడిచేయండి! తొందరగా లేచిచూడండి!' అంటూ లేపేశారు. నేను గూడా వాటిని కళ్లారా చూడాలనే కుతూహలంతో వెంటనేలేచి, తిన్నగా దొడ్లోకివెళ్లాను. పూర్ణచంద్ర బింబాల్లాగవికసించి తమగులాబిరంగు దేహకాంతిని కనుపరుస్తూ 'తమవంటి నవయవ్వనోజ్వల ప్రకాశంతో పుట్టిపడుతూండే, నూత్నవధూవరులింకెవరైనా వున్నారా?' అని సగర్వంతో చిరుమందహాసంతో ప్రశ్నిస్తూన్నట్లున్న ఆ పుష్పద్వయం, నా నేత్రద్వయానికి దిగ్గునగోచరమయ్యే సరికి, నాహృదయసాగరంలోని సంతోషతరంగాలు వొక్కసారిగా వుప్పొంగినాయి! 'ఆహా! యెటువంటి సుందరమయిన పువ్వులు!' అనేమాట నానోటినుండి అప్రయత్నంగా వెలువడింది! వెంటనే మా సుభాష్ గూడా 'ఆహా! యెతువంతి చుందలపూలు!' అని నా మాటనే సమర్థిస్తూ, యింట్లోకిపరుగెత్తుకుంటూవెళ్లి లలితనుగూడా లాక్కొచ్చి దానికిచూపించాడు పువ్వుల్ని యెంతోసంతోషంతో. అంతటితోవూరుకోక, మళ్లీ 'అబ్బ! యెంతచుందలంగావున్నై!' అంటూగెంతులేస్తూ వాటిదగ్గిరకువెళ్లి అమితానందంతోవాటి నాఘ్రాణిస్తూ, ముద్దుపెట్టుకుంటూ, ఆఖరికి అకస్మాత్తుగా ఒక్క పువ్వును త్రుంచివేశాడు!!

ఇంతవరకూ వాటి రమణీయత్వాన్నంతా, తదేకధ్యాన్నంతో అవలోకిస్తూ, అనంతానందాన్ని అనుభవిస్తూ తన్మయుణ్నై పోతూన్న నాకు, వాడిమీద తక్షణమే చాలకోపంవచ్చింది! వెంటనే రెండోపువ్వునుగూడా త్రుంచివేయాలని చూస్తూన్నవాణ్ణి పట్టుకొని 'యెందుకు

తెంపేవురా?' అని అంటూ రెండుదెబ్బలు కొట్టేసరికి 'ముద్దొచ్చి తెంపేనండి!' అని అత్తుంచినపువ్వును గాఢ ప్రేమతో ముద్దుపెట్టుకుంటూ అనేసరికి, నాకోపంచల్లారిపోయింది. కోపకారణంచేత కాకుండా, కేవలం అత్యంతాధిక ప్రేమపరిణామంవల్లనే మా సుభాషుద్వారా ఆ జంటకు యెడపాటు సంప్రాప్తమయిందని గుర్తించాను. అయినా వాడు నిర్దాక్షిణ్యంగా కోసివేయడంచేతా, అది వొంటరి అయిపోయినందుకూ నామనస్సు చివుక్కుమంది! ఇంక అక్కడ వుండలేకపోయాను.

★

మళ్లీ ఆమర్నాడు పెందలకడే,—మాయిందిరాసుభాషులు లేపకముందే లేచి, దొడ్లోకివెళ్లి చూస్తినిగదా, ఆయేకైకకుసుమం, తనప్రాణప్రియుణ్ణి కోల్పోయి, కన్నీరు మున్నీరై ప్రవహించేలాగు విలపించేకాంతలాగ, కళావిహీనవదనంతో వెలవెలబోతోంది! పాపం, నిన్నటి ఆ నవయవ్వనమంతా యేమయిపోయిందో యేమిటో, యివ్వాళ అపుడే, వృద్ధాప్యదశలోకి కాలుపెట్టింది! దాన్నిచూచేసరికి జాలీ, చింతాగూడా ఒక్కసారి నన్నావరించాయి! కొంతసేపటికి మామూలుప్రకారంగా యిందిరాసుభాషులు లేచీలేవడంతోనే దొడ్లోకివచ్చారు. కాని నిన్నగలిగిన సంతోషానికిబదులుగ యివ్వాళ రెట్టింపుచింత గలగడంచేత గాబోలు, యిందిర 'అయ్యోయ్యో!' అంటూ నిర్ఘాంతపోతూ నిలబడిపోయిందేగాని, యింకమాట్లాడలేకపోయింది! తనమూలాన్నే అది అలాగైపోయిందేమోనని మా సుభాష్‌గూడా చిన్నమొగం చేసుకుని మరి మాట్లాడకుండా వెళ్లిపోయాడు! నేనుగూడా వేడినిట్టూర్పొకటి విడిచి, దానివైపే చూస్తూ, చూస్తూ వెళ్లిపోయాను.

ఆఫీసుకువెళ్లేనేగాని, మనస్సంతా ఆపువ్వుస్థితిగురించే ఆలోచిస్తోంది! సాయంత్రంనాలుగుకాగానే యింటికి వచ్చేసి, తిన్నగా దొడ్లోకివెళ్లిచూచాను. దానివృద్ధాప్యదశగూడా పరిసమాప్తిబొందినట్లు నాకుకన్పడింది! దాని వాడిపోయిన రేకలన్నీ కుండీలోపడిపోయివున్నాయి. ఆసుందర సుమనశోభంతా యివ్వాళతో పూర్తిగాచల్లబడింది! అయ్యో దానిజీవితంఅంతా మున్నాళ్లముచ్చటేనా!! ఆమూడురోజుల్లోనే విడిచీవిడవకుండావుండే సగంపెదవులతో చిరునవ్వునవ్వుతూండే మొగ్గయింది! ఆమూడురోజుల్లోనే తనవంటి సుముజ్వలయవ్వనసుందరులిక, యీసౌందర్యసృష్టిలో లేరన్నట్లు, సగర్వమస్తకంతో సంపూర్ణంగా చాటుతూసంచరించింది!! ఆమూడురోజుల్లోనే వృద్ధాప్యంలో ప్రవేశించి, తర్వాత తన జీవితంగూడా ముగిసిందంటూ మనకథావస్తువై వెలసింది!!!

నిన్న నాలో పరిపూర్ణమయివున్న ఆ అపారానందమంతా మటుమాయమైపోయి, యివ్వాళహృదయాన్ని కలచివైచేచింతా, అగాధసాగరంలోముంచివేసే ఆలోచనా, నాలో ప్రవేశించాయి! 'అయ్యో, ఘాసుభాష్‌చేతినుండి నిన్నొకదాన్నైనా రక్షింపగలిగానుగాని, కాలదేవతనుండిమాత్రం రక్షింపలేకపోయానుగదా?' అని యెంతో జాలితో, విచారంతో మనస్సులోఅనుకుంటూ, వేడినిట్టూర్పులు విడుస్తూ, కాంతివిహీనమయిపోయిన, ఆ కుసుమంవైపు ఒక్కక్షణంవరకూ తదేకదృష్టితో చూస్తూండేసరికి, 'మీ మానవజీవితంగూడా మాజీవితంలాగే మున్నాళ్ళముచ్చటిదేగదూ?' అని అది తలపంకించి అంటూన్నట్టు నాకు తత్క్షణమే దృగ్గోచరమయింది! అప్పుడే నా అంతరాత్మకుగూడా అలాగేతట్టింది! వెంటనే శరీరం కంపించిపోయింది! నిశ్చేష్టుణ్ణై, యెక్కడివాణ్ణక్కణ్ణే నిలబడిపోయాను !!

☆

REGD. TRADE MARK
MESSRS LAKSHMI & CO.

దేశం బాగుపడాలంటే అందరు ఏకముకావాలి!!

కోట్లకొలది ప్రజ ఘోరమరణాలపాలౌతూవుంది! అంటరానివారిని దరిచేరుస్తున్నాం !...అంటరాని రోగులకు మనంచేస్తున్న ఉపకారాలేమిటి ??

"లెప్పర్‌క్యూర్" వేలకొలది, కుష్ఠు, బొల్లి, మేహరోగులకు పునర్జన్మ ప్రసాదించి!!

గ్యారంటిచికిత్స ఇస్తోంది!!

* నకలు మందులకు మోసపోక "లెప్పర్‌క్యూర్"నే వాడండి:—

లక్ష్మీ అండు కో., (రిజిష్టర్డు)

H.O, వాల్తేరు ఆర్. యస్. పోస్టు.

బ్రాంచీలు :—22, బ్రాడ్వే or P. B. No. 134, మద్రాసు. గాంధీనగరం, బెజవాడ.